క్లుప్తంగా

శ్రీకల్యాణ వెంకన్నకు పరదాల సమర్పణ



పరదాలను వితరణగా అందజేస్తున్న దాత

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామికి బుధవారం పరదాలను సమర్పించారు. ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు స్వామివారి వార్షిక సాలకట్ల సాక్షాత్కార వైభవోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తిరుపతికి చెందిన శ్రీవారి భక్తుడు మణి బుధవారం రెండు పరదాలను వితరణగా ఆలయ అధికారులకు అందజేశారు. పరదాలను స్వామివారి ఉత్సవాలకు వినియోగించాలని దాత అధికారులను కోరారు. అనంతరం అధికారులు దాతకు ప్రత్యేక దర్శనం చేయించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

స్వయం ఉపాధి లక్ష్యం



మాట్లాడుతున్న దామోదరం

తిరుపతి కల్చరల్: మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో టైలరింగ్ శిక్షణ ప్రారంభించామని వేమన విజ్ఞాన కేంద్రం గౌరవ సలహాదారుడు టి.దామోదరం తెలిపారు. జన శిక్షణ సంస్థ సహకారంతో వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణను బుధవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు స్వశక్తితో ఆర్థికాభివృద్ధి సాధించి తర్వాత కుటుంబానికి బాసటగా కుటుంబపోషణలో భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందన్నారు. టైలరింగ్ నేర్చుకోవడం ద్వారా కుటుంబంలో ఆర్థికంగా స్థిరత్వం వచ్చి కుటుంబ అభివృద్ధి కారణమవుతుందని తెలిపారు. మహిళలందరూ స్వయం ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. 105 రోజులపాటు జరిగే ఈ ఉచిత టైలరింగ్ శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకుని రాణించాలని సూచించారు. వేమన విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు నడ్డి నారాయణ, మల్లారపు నాగార్జున, తహసున్నీసా బేగం, మునిలక్ష్మి, జన విక్షణ సంస్థ డైరెక్టర్ మోహన్, జేఎస్ఎస్ ప్రతినిధి సుధాకర్, ట్రైనర్ సుమతి పాల్గొన్నారు.

శ్రీకోదండరామాలయంలో విశేష ఉత్సవాలు

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామాలయంలో ఈనెల పలు విశేష ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులోభాగంగా ఈనెల 13, 20, 27వ తేదీల్లో శనివారం సందర్భంగా ఉదయం 6 గంటలకు శ్రీసీతారామలక్ష్మణుల మూలవర్లకు అభిషేకం, సాయంత్రం 5 గంటలకు ఊంజలసేవ నిర్వహిస్తారు. ఈనెల 5న అమావాస్య సందర్భంగా ఉదయం 8 గంటలకు సహస్ర కలశాభిషేకం నిర్వహిస్తారు. అదే రాత్రి 7 గంటలకు హనుమంత వాహనసేవ జరగనుంది. ఈనెల 6న పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని ఉదయం 11 గంటలకు శ్రీసీతారాముల కల్యాణం వేడుకగా నిర్వహిస్తారు. 21న పౌర్ణమి సందర్భంగా ఉదయం 8.30 గంటలకు అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహిస్తారు. 16న ఆణివార ఆస్థానం చేపడతారు. 30వ తేదీ నుంచి 2వ తేదీ వరకు స్వామి వారి పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు.

మందుబాబులకు జరిమానా

తిరుపతి లీగల్: మద్యం తాగి తిరుపతిలో వాహనాలు నడుపుతున్న 18 మందికి రూ.లక్షా 80 వేల జరిమానా విధిస్తూ తిరుపతి నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు. ట్రాఫిక్ పోలీసులు తిరుపతిలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించినట్లు కోర్టు కానిస్టేబుల్ గిరిబాబు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 18 మందిపై పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ఎస్వీ రంగారావుకు ఘన నివాళి



కళాకారులను అభినందిస్తున్న రంగస్థలి ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ప్రముఖ నటుడు ఎస్వీ రంగారావు జయంతి వేడుకలు రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వీఆర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం సినీ, నాటక రంగంలో అత్యుత్తమ ప్రతిభతో రాణిస్తూ కళామతల్లికి సేవలు అందిస్తున్న పాన్నాల జేజిరెడ్డి, శాంబోలు హరినాథ్‌లను జ్ఞాపికలు, శాలువలతో రాయలసీమ రంగస్థలి ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి, కార్యదర్శి కేఎస్.రాజా, కళాకారులు మునిరత్నం, వెంకటస్వామి, జయరామయ్య, నరసింహారెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

అన్నమో రామచంద్రా..

ఎస్వీయూలో విద్యార్థినుల ఆందోళన



హాస్టల్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థినులు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో బుధవారం రాత్రి పీజీ ఉమెన్స్ హాస్టల్ ప్రెమిసెస్–2లో విద్యార్థినులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. హాస్టల్ మెస్‌లో నాణ్యత లేని భోజనం విద్యార్థులకు పెడుతున్నారని, అధికారులు దీనిపై స్పందించాలని వారు నినాదాలు చేశారు. హాస్టల్ వార్డెన్, అధికారులు తమ సమస్యలను పట్టించుకోవడం లేదంటూ వారు ఆరోపించారు. ప్రతిరోజూ విద్యార్థులకు నాసిరకం భోజనం, వంటలు, కూరలు వడ్డిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భోజనంతోపాటు హాస్టల్ పలు సమస్యలు ఉన్నాయని పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్ వార్డెన్‌ను సాక్షి వివరణ కోరగా బుధవారం రాత్రి మెనూ ప్రకారం చికెన్ సర్వీస్ చేశామని తెలిపారు. చికెన్ కాస్త ఎక్కువగా ఉడకడంతో విద్యార్థినులు తమ దృష్టి తీసుకొచ్చారని, వంట సిబ్బందితో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని సమాధానం చెప్పారు.

తిరుపతిలో అంతా ఆయనే!

- షాడో ఎమ్మెల్యే ఆరణి శివకుమార్
- సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి

తిరుపతి కల్చరల్: తిరుపతిలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అయితే కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ పక్కన కుర్చీలో కూర్చుని అధికారులు ఎలా పనిచేయాలో చెబుతున్న షాడో ఎమ్మెల్యే ఆరణి శివకుమార్ అని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగర ప్రజలందరూ కూడా గమనించాలని, స్థానికులకు కాకుండా బయటవాళ్లకు అధికార పట్టం కట్టినందుకు ఇలాంటి షాడో ఎమ్మెల్యేలు దండిగా పుట్టుకొస్తున్న విషయం ప్రజలు గమనించాలని తెలిపారు. జనసేన నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఆరణి శ్రీనివాసులుకు అన్న కుమారుడు ఎమ్మెల్యే తరఫున అధికారుల బదిలీలు మొదలు సమీక్షల వరకు అన్నీ శివకుమార్ కానిచ్చేస్తున్నారని పేర్కొన్నారు. తిరుపతి ఎమ్మెల్యే తానే అయినట్లుగా మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ అదితిసింగ్ పక్కన కుర్చీలో దర్జాగా కూర్చుని అధికారులు ఎలా పనిచేయాలో దిశానిర్దేశం చేయడం విడ్డూరమని తెలిపారు. పనిలో పనిగా అటెండర్ నుంచి కమిషనర్ వరకు అందరూ మంచిగా పనిచేసి ఎమ్మెల్యేకు మంచి పేరు తేవాలని ఉపదేశించడం హాస్యాస్పదమని తెలిపారు. ఐఏఎస్ అధికారి కమిషనర్ కూడా ఈ షాడో ఎమ్మెల్యే ఉపన్యాసాన్ని బుద్ధిగా తల ఊపుతూ వినడం మరో విచిత్రమనిపిస్తోందని పేర్కొన్నారు. ప్రశాంతంగానున్న తిరుపతిలో ఇలా బయట వాళ్లు వచ్చి ఎవరికి తోచింది వారు చేసుకుంటూ వెళితే తిరుపతి పవిత్రతను, వ్యవస్థలను కాపాడేది ఎవరని ఆయన ప్రశ్నించారు. ఐఏఎస్ అధికారులుగా ఉండి కూడా ఇలాంటి వాటిని ప్రోత్సహిస్తున్నందుకు ప్రభుత్వం తక్షణమే ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే గెలిచినప్పటి నుంచి ఆరణి శ్రీనివాసులు ఈనెల రోజుల వ్యవధిలో ఏ సమస్యపైనా స్పందించి ఉంటే పత్రికా ప్రకటనల ద్వారా తెలియజేయాలని, శాలువలు, బొకేలు తీసుకొనే కార్యక్రమాలు ఇకనైనా నిలుపుదల చేసి ప్రజాసమస్యలు తెలుసుకొని ఆ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని డిమాండ్ చేశారు.

న్యాయమూర్తి ఆదేశం.. పరిసరాల శుభ్రం

తిరుపతి లీగల్: తిరుపతి కోర్టు ఆవరణలోని నాల్గవ అదనపు జిల్లా జడ్జి కోర్టు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ కోర్టు న్యాయమూర్తి అర్చన ఆదేశాల మేరకు ఆ కోర్టు పరిసరాలు శుభ్రం అయ్యాయి. కోర్టు ఇరువైపులా పిచ్చి మొక్కలు మొలిచాయి. అలాగే పెద్ద వృక్షాల కొమ్మలు కోర్టు భవనంపై పడుతూ ఉండడంతో కోర్టు సిబ్బందికి ఇబ్బందికరంగా ఉండేది. అదే విధంగా భవనం పక్కన చెత్తాచెదారం చేరడంతో పాములు, క్రిమికీటకాలు అక్కడ చేరి కోర్టు భవనంలోకి తరచూ వస్తూ ఉండేవి. గమనించిన న్యాయమూర్తి కోర్టు భవనం పరిసరాలను శుభ్రం చేయాలని మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బందిని ఆదేశించారు. దీంతో సిబ్బంది పరుగున వచ్చి కోర్టు భవన పరిసరాలను శుభ్రం చేశారు. అలాగే కోర్టు సిబ్బందికి నీటి కొరతను తీర్చడానికి ఇదివరలో ఉన్న నీటి పంపు మిషన్లను రిపేర్ చేయించాలని న్యాయమూర్తి ఆదేశించినట్లు తెలిసింది. కోర్టు భవన పరిసరాలు న్యాయమూర్తి ఆదేశాలతో శుభ్రం కావడంతో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తిరుమలలో జెర్రిపోతుల కలకలం



తిరుమల: తిరుమలలోని హెచ్‌బీసీ అతిథిగృహాల సమీపంలో జెర్రిపోతులు కలకలం సృష్టించిన సంఘటన బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. టీటీడీ అటవీ ఉద్యోగి భాస్కర్‌నాయుడు తెలిపిన వివరాల మేరకు.. హెచ్‌బీసీ అతిథిగృహం సమీపంలోని పార్కులో రెండు జెర్రిపోతులు ఉన్నట్లు స్థానికులు సమాచారం అందించారన్నారు. వెంటనే అక్కడకు చేరుకున్న ఆయన 8, 9 అడుగుల రెండు జెర్రిపోతులను చాకచక్యంగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం రెండు పాములను అవ్వాచారి కోనలో విడిచిపెట్టినట్లు తెలిపారు.

నాణ్యత పరిశీలన తర్వాతే బిల్లులు

– ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి(అలిపిరి): మాస్టర్ ప్లాన్ రోడ్ల నాణ్యతపై థర్డ్ పార్టీ పరిశీలన తరువాతే బిల్లులు చెల్లించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కులశేఖర్ ఆళ్వార్ మార్గాన్ని పరిశీలించారు. ఈ మార్గంలోని రోడ్డు కుంగిపోవడంతో పాటు అండర్ గ్రౌండ్ కేబుల్స్ కోసం రోడ్డును తవ్విన తీరును చూశారు. రూ.7కోట్లతో రోడ్డు పనులు చేసినట్లు ఎస్ఈ మోహన్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఎస్పీడీసీఎల్ ఈఈ దామోదర్ మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ కేబుల్స్ కోసం రోడ్డును తవ్వడంతో కుంగిందని తెలిపారు. ప్రజలకు కలిగిన అసౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని త్వరగా మరమ్మతులు పూర్తిచేస్తామని తెలిపారు. ఐదు వరుస కేబుల్ కోసం అండర్ గ్రౌండ్‌లో డ్రిల్ చేయడంతో రోడ్డు దెబ్బతిందని ఎస్ఈ మోహన్ చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, నరసింహయాదవ్, ఆర్సీ మునికృష్ణ, చినబాబు, కృష్ణయాదవ్ పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీకి మరమ్మతులు చేయాలి

- కమిషనర్ అదితిసింగ్



మురుగుకాలువను పరిశీలిస్తున్న కమిషనర్ అదితిసింగ్

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో పాడైన భూగర్భ డ్రైనేజీ, మ్యాన్‌హోల్‌లకు వెంటనే మరమ్మతులు చేయాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలో పారిశుధ్య అమలుపై అధికారులతో కలసి బుధవారం ఆమె పలు ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. అక్కడక్కడ మ్యాన్‌హోల్ ఓవర్‌ఫ్లో, మురుగు కాలువలు పాడైపోవడాన్ని స్వయంగా గుర్తించారు. కాలువలు అక్కడక్కడ ధ్వంసం అయిపోవడం వల్ల మురుగునీరు పోవడం లేదని, వ్యర్థాలు సైతం ఎక్కడికక్కడ స్తంభించిపోతున్నా ఎందుకు పట్టించుకోలేదని ఇంజినీర్లను నిలదీశారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర వ్యాప్తంగా అన్ని డివిజన్లలో మరమ్మతుకు గురైన కాలువలపై దృష్టి సారించినట్లు చెప్పారు. కాలువలకు మరమ్మతులు చేయడంతో పాటు మ్యాన్‌హోల్ ఓవర్‌ఫ్లోను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె చెప్పారు. పారిశుధ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. తాగునీరు కలుషితం కాకుండా ఇంజినీర్లు తనిఖీలు నిర్వ హించేలా ఆదేశించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్, మున్సిపల్ ఇంజినీర్ వెంకటరామిరెడ్డి, డీఈఈ శ్రావణి, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



ఎంఈఓను కలిసిన బీటీఏ నాయకులు

దొరవారిసత్రం : ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీటీఏ ఉపాధ్యాయుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. వారు బుధవారం మండలంలోని పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేశారు. వారు మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను పరిష్కరించాలన్నారు. జీఓ నంబర్ 117ను రద్దు చేసి 3, 4, 5 తరగతులను ప్రైమరీ పాఠశాలల్లో కలిపి ప్రాథమిక విద్యను కాపాడాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల బకాయిలు వెంటనే చెల్లించాన్నారు. అనంతం ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాని వినతి పత్రాన్ని స్థానిక ఎంఈఓ కృష్ణయ్య అందజేశారు. బీటీఏ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు మునస్వామి, శేషయ్య, రవి, శ్రీనివాసులు, నాగరాజు, వినయ్‌కుమార్, దొరబాబు, సతీష్ పాల్గొన్నారు.

ఎర్రచందనం కేసులో ముగ్గురికి జైలు

తిరుపతి లీగల్: ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ముగ్గురికి ఆరు నెలలు జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి ఎర్రచందనం కేసుల విచారణ జూనియర్ జడ్జి శ్రీకాంత్ బుధవారం తీర్పు చెప్పారు. శ్రీకాళహస్తి రూరల్ ఏఎస్ఐ చంద్రశేఖర్ రాజు, కోర్టు లైజన్ ఆఫీసర్ రాజగోపాల్‌రెడ్డి తెలిపిన కేసులోని వివరాల మేరకు... 2014 సెప్టెంబర్ 10వ తేదీ శ్రీకాళహస్తి మండలం, గొల్లపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌లో కొంతమంది ఎర్రచందనం దుంగలను నరికి అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు కారులో 86 కిలోల ఆరు ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న ఆరుగురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో తిరుపతి రూరల్ తిమ్మినాయుడు పాలెం పంచాయతీ, ఆటోనగర్, అంబేడ్కర్ కాలనీకి చెందిన కొల్లంగుంట శివ, రేణిగుంట, అంబేడ్కర్ నగర్‌కు చెందిన బోయలపల్లి దాము, బోయలపల్లి మురళీలపై న్యాయమూర్తి ముగ్గురికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. మరో ముగ్గురిపై నేరం రుజువు కాకపోవడంతో వారిపై కేసు కొట్టివేస్తూ తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ శిరీష వాదించారు.

ఘనంగా సత్యమ్మ ఊరేగింపు



గంగమ్మ ఉత్సవ విగ్రహ ఊరేగింపు

పాకాల: మండల కేంద్రంలోని సత్యమ్మ ఆలయంలో జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం వేకువ జాము నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే ఏర్పాటు చేసిన గంగమ్మ ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకమైన రంగురంగుల పూలతో అలంకరించారు. భక్తులు పొంగళ్లు పెట్టి తమ కోర్కెలు తీరాలని ప్రార్థించారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాలతో, మంగళ వాయిద్యాలతో, బాణసంచా పేల్చుతూ ఊరేగించారు. తమ ఇంటి ముంగిటకు వచ్చిన అమ్మవారికి కర్పూరహారతులు పట్టి పూజలు చేశారు. యువత రెట్టించిన ఉత్సాహంలో ఊరేగింపు కార్యక్రమాన్ని విజయవంతం చేసి, భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం సమీపంలోని చెరువులో గంగమ్మ ఉత్సవ విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

17 నుంచి శ్రీసిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

తిరుపతి(అలిపిరి): ఈనెల 17 నుంచి 25వ తేదీ వరకు తాళ్లపాకలోని శ్రీసిద్ధేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారని జేఈఓ వీరబ్రహ్మం తెలిపారు. బ్రహ్మోత్సవాలకు ఈనెల 16న ఉదయం అంకురార్పణ నిర్వహిస్తారని, 17న ఉదయం 6.28 గంటలకు ధ్వజారోహణంతో బ్రహ్మో త్సవాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. సాయంత్రం హంస వాహనసేవ నిర్వహిస్తారు. 18, 19, 20, 21వ తేదీల్లో ఉదయం పల్లకీ ఉత్సవం నిర్వహిస్తారు. 18న సాయంత్రం చంద్రప్రభ వాహనం, 19న సాయంత్రం చిన్నశేష వాహనం, 20న సాయంత్రం సింహవాహనం, 21న సాయంత్రం నంది వాహనసేవ జరుగుతాయి. 22న సాయంత్రం 6 నుంచి రాత్రి 7 గంటల వరకు ఆర్జిత కల్యాణోత్సవం జరగనుంది. గృహస్తులు(ఇద్దరు) రూ.300 చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు. రాత్రి 7.30 గంటలకు గజవాహనంపై స్వామివారు విహరించనున్నారు. 23న సాయంత్రం పల్లకీ సేవ, 24న సాయంత్రం 6 గంటలకు పార్వేట ఉత్సవం, 25న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు త్రిశూల స్నానం, సాయంత్రం 5 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. బ్రహ్మోత్సవాల్లో రోజూ ఉదయం 8 గంటలకు, సాయంత్రం 6 గంటలకు వాహనసేవలు నిర్వహిస్తారు. ఉదయం 9 గంటలకు శ్రీసిద్ధేశ్వరస్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు పుష్పయాగం జరగనుంది. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో రోజూ హరికథలు, ఆధ్యాత్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తారు.

మర్యాద, మన్నన ముఖ్యం



నూతన కమిటీ సన్మాన కార్యక్రమంలో డీపీటీఓ చెంగల్‌రెడ్డి

- ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించాలి
- డీపీటీఓ టి.చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: ఆర్టీసీ ఉద్యోగులపై పలు ఫిర్యాదులు వస్తున్నాయి..ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి(డీపీటీఓ) తిమ్మాడి చెంగల్‌రెడ్డి అన్నారు. తిరుపతిలోని డీపీటీఓ కార్యాలయంలో బుధవారం ఎంప్లాయీస్ యూనియన్(ఈయూ) జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, అధ్యక్షుడు గురున్నాథం నేతృత్వంలో నూతన కమిటీ పరిచయ కార్యక్రమాన్ని చేశారు. డీపీటీఓ మాట్లాడుతూ రాబడిలో తిరుపతి జిల్లా వరుసగా ఐదేళ్ల నుంచి ప్రథమస్థానంలో ఉన్న విషయాన్ని వెల్లడించారు. ప్రధానంగా తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడానికి దేశ, విదేశాల నుంచి భక్తులు వస్తుంటారని పేర్కొన్నారు. వారితో కండక్టర్లు గౌరవంగా మెలగాలని అన్నారు. తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో నిర్వహిస్తున్న దుకాణాల్లో లోకల్, నాన్‌లోకల్ అయినా ఎమ్మార్పీ ధరలకే వస్తువులు విక్రయించాలని ఈసందర్భంగా ఆయన తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఉద్యోగ సంఘాలు ముందు ఉండాలని చెప్పారు. ఈయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ సేవాభావంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. నూతన కమిటీలో రాష్ట్ర సహాయ కార్యదర్శి మురగమ్మ, జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వి.మస్తాన్, జోనల్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బి.మల్లికార్జున్, రీజనల్ చీఫ్ వైస్ ప్రెసిడెంట్‌గా జీఆర్ చంద్ర, రీజనల్ పబ్లిసిటీ కార్యదర్శిగా జే.సతీష్‌నాయుడు, రీజనల్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె.హరిప్రసాద్‌ను డీపీటీఓకు పరిచయం చేశారు. ఆ మేరకు వారిని సన్మానించారు. డెప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి, కంట్రోలర్ వీఆర్ కుమార్ పాల్గొన్నారు.

నకిలీ పత్రం ఇచ్చిన వ్యక్తికి ఏడాది జైలు

తిరుపతి లీగల్: తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నకిలీ శాలరీ సర్టిఫికెట్ ఇచ్చి మోసం చేసిన కేసులో తిరుపతి, హరిపురం కాలనీకి చెందిన మండము రాముకు ఏడాది జైలు శిక్ష, రూ.1,500 జరిమానా విధిస్తూ తిరుపతి ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి వాణిశ్రీ బుధవారం తీర్పు చెప్పారు. కోర్టు కానిస్టేబుల్ రమేష్ తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన ఓ క్రిమినల్ కేసులో నిందితులుగా అభియోగాలు ఎదుర్కొన్న తిరుపతి స్కావెంజర్ కాలనీ చెందిన పి.బాలాజి అలియాస్ బిల్లా, తిరుపతి సుందరయ్యనగర్‌కు చెందిన బి.లోకేష్ స్థానిక రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకున్నారు. కోర్టు జామీను ఇచ్చి విడుదల కావాలని ఉత్తర్వులు జారీ చేసింది. 2016 సెప్టెంబర్ రెండో తేదీ ఇద్దరి తరఫు న్యాయవాది తిరుపతి హరిపురం కాలనీకి చెందిన మండము రాము ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్నట్టు ఓ శాలరీ సర్టిఫికెట్ సమర్పించి ఇద్దరినీ జామీనుపై విడుదల చేయాలని కోర్టును కోరాడు. న్యాయమూర్తి ఆ శాలరీ సర్టిఫికెట్‌పై అనుమానం రావడంతో పోలీసులను దర్యాప్తు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

పోలీసులు దర్యాప్తు చేయగా శాలరీ సర్టిఫికెట్ ఫోర్జరీ సంతకాలతో తయారు చేసిందని దర్యాప్తులో తేలింది. దీంతో న్యాయమూర్తి ఆదేశాలతో తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అప్పటి సూపరింటెండెంట్ శ్రవణ్‌కుమార్ తిరుపతి వెస్ట్ పోలీసులకు రాముపై ఫిర్యాదు చేశారు. కోర్టులో నేరం నిందితుడు రాముపై రుజువు కావడంతో న్యాయమూర్తి అతనికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు

దర్జాగా ప్రభుత్వ భూమి ఆక్రమణ



జేసీబీతో చదును చేస్తున్న దృశ్యం

- పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- సర్పంచ్, గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు

భాకరాపేట: ప్రభుత్వ భూముల దురాక్రమణ యథేచ్ఛగా సాగుతున్నా రెవెన్యూ శాఖ పట్టించుకోవడం లేదని పెద్దఎత్తున చర్చనీయాంశమైంది. బుధవారం చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండ పంచాయతీ పరిధిలో జేసీబీల సాయంతో ప్రభుత్వ భూమిని చదును చేస్తుండంగా గ్రామస్తులు, సర్పంచ్‌తో కలసి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. మల్లెలవారిపల్లెకు సమీపంలోని కుమ్మర కుంట, జమ్మిశెట్టి కుంట, పాపమ్మచెరువు కట్ట, పెద్ద కుంటకు చెందిన భూమిని ఆక్రమించి చదును చేస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ప్రాంతంలో మల్లెలవాండ్లపల్లెకు చెందిన గ్రామస్తులు సంక్రాంతి పండుగ ఉత్సవాల్లో నిర్వహించే కనుమ పండుగ రోజు కాటమరాజుకు అక్కడే పూజలు చేసి పశువులను ఊరేగించి, ఉత్సవాలు నిర్వహించుకుంటామని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆ ప్రాంతం చాలా పురాతనమైనదని, సదరు భూమిలోనే గతంలో తిరుమలకు నడక దారి ఉండేదని చెబుతున్నారు. ఆక్రమణదారుల నుంచి ప్రభుత్వ భూమిని కాపాడి గ్రామంలోని పశువులు, గొర్రెలు, మేకలు మేపుకునేందుకు చొరవ తీసుకోవాలని కోరారు.